# మహాపాతకం

—పాలంకి సత్య

‘‘నాకు చాలా భయమేస్తోందండీ’’

‘‘భయమెందుకు వందనా. ఇదేమైనా మొదటిసారా నేను క్యాంపుకి వెళ్లడం? నాది టూరింగ్ జాబ్ అని నీకు పెళ్లికి ముందే తెలుసు. పెళ్లయ్యాక ఎప్పుడూ లేనిది ఇప్పుడు భయమంటున్నావేమిటి?’’ అన్నాడు నవీన్.

‘‘ఇప్పుడే, ఈసారే, నాకు భయమేస్తోందండీ’’

‘‘ఇప్పుడెందుకు భయం. ఇంట్లో మా తమ్ముడు కూడా నీకు సాయమున్నాడు కదా’’

అదే, ఆ తమ్ముడు ఇంట్లో వుండడమే తన భయానికి కారణమని ఎలా చెప్పగలదు? తమ పెళ్లి నాటికి భర్త తమ్ముడు ప్రవీణ్ బెనారస్‌లో చదువుకుంటున్నాడు. పెళ్లికి రావడానికి అతనికి కుదరలేదు. తమ పెళ్లయిన ఏడాది తరువాతనే అతన్ని మొదటిసారిగా చూసింది. తనతో అతనన్న మొదటి మాటలు వినగానే పెనుగాలికి లతలా కంపించిపోయింది...

తమ ఇద్దరికీ పరిచయం చేసి భర్త స్నానానికి వెళ్లాడు. తను కాఫీ తీసుకుని వచ్చి అతనికి అందించింది. తనవైపు రెప్పార్పకుండా చూస్తూ ‘‘మీ పెళ్లికి ముందే నిన్ను చూసి వుంటే నువ్వు మా అన్నయ్యకు దక్కేదానివి కాదు’’ అన్నాడు.

తను భయంతో ఒణికిపోయింది. తమాయించుకుని ‘‘అలా అనుకోవడం తప్పు కదా’’ అంది.

ఆ సంభాషణ అక్కడతో ఆగిపోయింది కానీ అతని మాటలూ, చేతలూ తనకు ఇబ్బంది కల్గిస్తూనే వున్నాయి. నెల్లాళ్లయింది అతను వచ్చి. అదృష్టవశాత్తూ ఈ నెలరోజులుగా భర్తకి టూరు లేదు. ఇప్పుడింట్లో అతనితోపాటుగా రాత్రి ఒక్కర్తీ వుండాలంటే చాలా భయంగా వుంది. ‘‘మీ తమ్ముడి ప్రవర్తన బాగులేదు. అతన్ని పంపించెయ్యండి’’ అని భర్తకు ఎలా చెప్పడం?

వందనను ఆలోచనలనుంచి బయటపడేస్తూ నవీన్ ‘‘ఫ్లైట్‌కి టైమవుతోంది.. నేను వెళ్లి వస్తాను. అక్కడకు చేరగానే ఫోను చేస్తాను. ధైర్యంగా వుండు’’ అంటూ బెడ్రూంలోనుంచి బయటకు వచ్చాడు. వందన అతని వెనకాలే బయటకు వచ్చింది.

హాల్లో కూచుని టి.వి చూస్తున్న ప్రవీణ్‌తో ‘‘మీ వదిన్ని జాగ్రత్తగా చూస్తూ వుండు. నేను వారం రోజుల్లో తిరిగి వచ్చేస్తాను. రాగానే నీ ఉద్యోగం సంగతి చూస్తాను’’ అన్నాడు నవీన్.

ప్రవీణ్ తల ఊపాడు.

వందన టైం చూసింది. రాత్రి తొమ్మిదవుతోంది. ఇప్పుడే బెడ్రూంలోకి వెళ్లి లోపల తలుపు వేసుకుని పడుకుంటే సరి. అటాచ్‌డ్ బాత్రూం కాబట్టి రాత్రి తలుపు తియ్యక్కరలేదు. పనిమనిషి పొద్దుట అయిదింటినుంచి తొమ్మిదింటిదాకా వుంటుంది. అప్పుడు బయటకు వెళ్లి సాయంత్రం దాకా ఏ ఫ్రెండ్ ఇంట్లోనే గడపాలి. సాయంత్రం ఏ పక్క ఫ్లాట్ పిల్లలనో ఇంట్లో వుంచుకోవాలి. ఎలా గడుస్తాయిరా బాబూ వారం రోజులు.

వందన కళ్లు మూసుకుని పడుకుంది. ఆమెకు నిద్ర పట్టడంలేదు. ప్రవీణ్ టి.వి ఆపేసి వెళ్లి పడుకున్నట్లున్నాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదేమిటి? లేచి ఏదైనా పుస్తకం చదువుకుంటే మంచిదేమో.

కాలింగ్ బెల్ మోగింది. వందన ఆశ్చర్యపోయింది. ఇంత రాత్రి ఎవరు వస్తారు. ప్రవీణ్ కోసమే అయి వుంటుంది. అతనే తీస్తాడులే అనుకుంది.

కాలింగ్ బెల్ ఇంకో రెండుసార్లు మోగింది. ప్రవీణ్ నిద్రపోయాడా అనుకుంటూ వందన లేచి బెడ్రూం తలుపు తీసి హాల్లోకి వచ్చింది. హాల్లో జీరోవాట్ బల్బు వెలుగుతోంది. వందన వీధి తలుపు తీసింది. గుమ్మంలో ఎవరూ లేరు.

వందనకు ఏమీ అర్థం కాలేదు. మూడుసార్లు కాలింగ్ బెల్ కొట్టి ఎప్పటికీ తలుపు తియ్యలేదని వెళ్లిపోయారా? ఇంత రాత్రి వచ్చినవాళ్లు అలా వెళ్లిపోతారా? అసలు కాలింగ్ బెల్ మోగలేదా? తను భ్రమపడిందా?

వందన తలుపు వేసి వెనక్కి తిరిగేసరికి హాల్లో ట్యూబ్ లైటు వెలిగింది. ప్రవీణ్ నవ్వుతూ నిల్చున్నాడు.

‘‘నేనే కాలింగ్ బెల్ కొట్టాను. నిన్ను బెడ్రూం బయటకు రప్పించడానికి అది ఒక్కటే సులువైన మార్గంలా కన్పించింది. బెల్ కొట్టి నువ్వు నీ గది లోపలి గడియ తీస్తుండగానే లోపలకు వచ్చి తలుపు వేశాను. గాడ్రెజ్ తాళమేగా సులువుగా మూసేసి నా గదిలోకి వెళ్లిపోయాను.

‘‘ఎందుకు చేశావీ పని?’’ వందన భయపడుతూ అడిగింది.

‘‘చెప్పానుగా నిన్ను గది బయటకు రప్పించడానికి, ఆ తర్వాత నా కౌగిలిలోకి తీసుకోడానికి’’

‘‘ప్రవీణ్, ఎంత తప్పుగా ఆలోచిస్తున్నావు. రామాయణం చదవలేదా? లక్ష్మణుడికి సీత కాలినూపురాలు తప్ప మిగిలిన నగలు కూడా తెలియవుట. నువ్వు వదిన గురించి చెడుగా ఆలోచించవచ్చా? వదిన తల్లితో సమానం.’’

‘‘ధర్మపన్నాలు చెప్పకు. నీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. టైం వేస్ట్ చెయ్యకు. నేను అన్నయ్యకు చెప్పనులే’’

‘‘వెధవ ఆలోచనలు మాని పడుకో’’ అంటూ వందన తన గదిలోకి వెళ్లబోయింది. ప్రవీణ్ ఆమెకు అడ్డంగా వచ్చి చెయ్యి పట్టుకున్నాడు. వందన వదిలించుకుని రెండోవైపు పరిగెత్తింది. ఆమె కాలికి డైనింగ్ టేబిల్ తగిలింది. భయపడుతూ టేబిల్ పక్క నుంచి వంటింట్లోకి పరిగెడుతున్న ఆమెకు టేబిల్ మీద కూరలు తరిగే కత్తి కన్పించింది.

ఆమె కత్తిని చేతిలోకి తీసుకుని ‘‘అక్కడే ఆగు ప్రవీణ్. ముందుకు వచ్చివా ఈ కత్తితో నిన్ను పొడుస్తాను. లేదా నన్ను నేను పొడుచుకుంటాను’’ అంది.

ప్రవీణ్ ఆమె మాటలు లక్ష్యపెట్టకుండా మీదకి రాబోయాడు. వందన భయపడిపోయింది. అతని పశుబలం ముందు తను ఆగగలదా...

వీధి తలుపు తీసిన చప్పుడైంది. తన దగ్గరున్న తాళంతో తలుపు తీసుకుని లోపలకు వచ్చిన నవీన్ మ్రాన్పడిపోయాడు.

ఎదురుగా కీచకుడిలా తన తమ్ముడు ప్రవీణ్. భద్రకాళిలా చేత్తో కత్తితో తన భార్య వందన.

భర్తను చూసిన వెంటనే వందన చేతిలో కత్తి పడేసి ‘‘ఏమండీ’’ అంటూ పరిగెత్తుకుని వచ్చి అతని కౌగిలిలో వాలిపోయింది.

‘‘అన్నయ్యా అసలేమైందంటే...’’ అంటూ ప్రవీణ్ మొదలెట్టాడు.

‘‘నువ్వు నాకు చెప్పాల్సిందేమీ లేదు. లోపలికి వెళ్లు’’ అన్నాడు నవీన్.

ప్రవీణ్ తన గదిలోకి వెళ్లిపోయాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న వందనను సోఫాలో తన ఒళ్లో పడుకోబెట్టుకుని ధైర్యం చెప్పడానికి ఆమె తల నిమురుతూ కూచున్నాడు నవీన్. ప్రవీణ్‌లో ఏ మార్పూ రాలేదన్నమాట. చిన్నప్పుడు పదమూడేళ్ల వయసులో పనిపిల్ల బుగ్గ కొరకడం దగ్గర నుంచీ కాలేజీలో అమ్మాయి కొంగు లాగడం దాకా అన్నీ అల్లరి చిల్లర పనులే. కాలేజీ

నుంచి డిస్మిస్ చేసే పరిస్థితి వస్తే తన తండ్రి ప్రిన్సిపాల్ కాళ్లు పట్టుకుని టి.సి తీసుకుని బెనారస్‌లో చదువుకి పెట్టాడు. వయసు పెరిగింది కానీ బుద్ధి రాలేదు. ఈ వేళ ఫ్లైట్ కాన్సిల్ అయి తను ఇంటికి రాకపోతే ఎంత ప్రమాదం జరిగేది...

వందన కొంతసేపటికి నిద్రపోయింది కానీ నవీన్‌కి ఆరాత్రి నిద్రపట్టలేదు.

• • •



మర్నాడు నవీన్ ప్రవీణ్‌ని దగ్గరి కూచోపెట్టుకుని బుద్ధులు చెప్పాడు. ''ప్రవీణ్, నీ ప్రవర్తన ఏమీ బాగులేదు. వదినతో ప్రవర్తించవలసిన పద్ధతేనా? నువ్వు ఇలా వున్నావంటే అమ్మా, నాన్నా గుండె బద్దలై చచ్చిపోతారు. చిన్నప్పుడు వెధవ పనులు చేసినా పెద్దయ్యాక బుద్ధి వస్తుందని ఆశ పెట్టుకున్నాం. నీకు వయసు వచ్చింది కానీ జ్ఞానం రాలేదు. మంచిగా వుండకపోతే ఎన్ని కష్టనష్టాలు ఎదురవుతాయో తెలియదా...'' అంటూ గంటసేపు న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలూ, మంచి చెడ్డలు వివరంగా మాట్లాడాడు.

నవీన్ చెప్పినవన్నీ మాట్లాడకుండా విన్నాడు ప్రవీణ్. అంతా అయ్యాక ''సారీ అన్నయ్యా. ఏదో తెలియక తప్పు చేశాను. క్షమించు. ఇకమీదట బుద్ధిగా వుంటాను'' అన్నాడు.

''క్షమించమని అడగాల్సింది నన్ను కాదు. వెళ్లి మీ వదినని అడుగు''

''వదినా, నన్ను క్షమించు. ఏదో పొరపాటయింది''

''పొరపాటయిందా? ఆలోచించి చేసిన పని కాదా? తలుపు వేసుకు పడుకున్న నన్ను బయటకు రప్పించడానికి ఎంత నాటకం ఆడావు? దైవం రక్షించి ఫ్లైట్ కాన్సిల్ అయి మీ అన్నయ్య ఇంటికి వచ్చారు. లేకపోతే ఎంతటి ఘోరమైనా చేసేవాడివి. నిన్ను క్షమించడమా?'' వందన గట్టిగా అరిచింది.

''వదినా, నీ కాళ్లు పట్టుకుంటాను. నన్ను క్షమించు'' అంటూ వందన కాళ్లమీద పడ్డాడు ప్రవీణ్. వందన వెనక్కి జరిగింది.

నవీన్ ''ప్రవీణ్, ఇక్కడనుంచి వెళ్లిపో. నీ ఉద్యోగం గురించి ఈవేళే ప్రయత్నిస్తాను. ఎలాగూ నా టూర్ కాన్సిల్ అయిపోయిందిగా'' అన్నాడు.

''ఎక్కడకు వెళతాడు? పోలీస్ స్టేషనుకి పదండి. పోలీసు కంప్లైంటు ఇచ్చి జైల్లో పడేస్తే కానీ ఇలాంటివాళ్లకి బుద్ధి రాదు'' అంది వందన.

''వందనా, తన కోపమె తన శత్రువు అన్నారు. మనసుని శాంతపరుచుకో. నెమ్మదిగా ఆలోచించు. పోలీసు కంప్లైంటు వల్ల ఏ ప్రయోజనం వుంది? ఇంటి పరువు పోడం తప్ప ఏం లాభంలేదు. అమ్మా, నాన్నా బాధపడతారు. ఎందుకొచ్చిన గొడవ? ప్రవీణ్, మనింటికి వెళ్లు. జాబ్ దొరికాక రాస్తాను.''

వందన ఆలోచనలలో వుండగానే ప్రవీణ్ ''అన్నయ్యా, వెళ్లి వస్తాను. వదినా, వెళ్తున్నా'' నంటూ చేత్తో ఎయిర్ బాగ్ తీసుకుని వెళ్లిపోయాడు.

వందన భర్తమీద విరుచుకుపడింది. ''భార్యను రేప్ చెయ్యబోయినవాడిని వదిలేస్తారా? ఒక భర్త చెయ్యవలసిన పనేనా? నా గౌరవ మర్యాదలతో మీకు పని లేదా? వాటిని కాపాడాల్సిన బాధ్యత లేదా? నిన్న కత్తితో పొడుచుకుని చచ్చిపోయే పరిస్థితి వచ్చిందే. మీకు ఏం పట్టలేదు. అవునులెండి. రక్తసంబంధం గొప్పది. నేను పరాయిదాన్ని. బ్లెడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్ అన్న సామెత ఊరికినే వచ్చిందా.''

''వందనా, మా తమ్ముడు చేసిన పనిని నేను సమర్థించడంలేదు. వాడిని కూచోపెట్టి ఎంతసేపు బుద్ధి చెప్పానో నువ్వు చూడలేదా?''

''వట్టి మాటలతో ఏం పనవుతుంది? నా తమ్ముడే అలాంటి పని చేసి వుంటే నేను వాడి కాళ్లూ, చేతులూ విరిచేసేదాన్ని''

''కాళ్లూ, చేతులూ విరిచేస్తే బుద్ధి వస్తుందా? చెడుని చెడుతో జయించలేము. ఎప్పటికైనా మంచితోటే చెడుని జయించాలి. క్షమాగుణంతో ప్రపంచాన్ని మార్చే ప్రయత్నమే చెయ్యాలి. గౌతమ బుద్ధుడు, క్రీస్తు మహాత్మాగాంధీ బోధించిన మార్గమదే కదా''

''పాపాత్ముల్ని క్షమిస్తూపోతే ప్రపంచంలో పాపమే మిగుల్తుంది''

''తప్పు చేసినవాళ్లని శిక్షించినంతలో వాళ్లు మారిపోతారా? శిక్షతో మనుషుల్ని మార్చగలిగితే జైళ్ల అవసరం ఇన్నాళ్లు వుండేది కాదు. ప్రపంచంలో మనుషులంతా ఎప్పుడో మారిపోయేవారు.''

''మీలా క్షమిస్తూ వదిలేసేవాళ్లున్నంతకాలం పాపం నశించదు''

''నేను మాత్రమేనా? రోజూ పేపరు చదవడంలేదా? బస్సులో ప్రయాణీకుల్ని సజీవదహనం చేసినవారినే రాష్ట్రపతి క్షమించి వదిలిపెట్టారు. దానిముందు

## వెనుక సీటు కథ

జమ్మూ, కాశ్మీర్‌లకు కొంతకాలం భక్షీగులామ్ మహమ్మద్ ముఖ్యమంత్రిగా వున్నారు. ఆ సమయంలో ప్రముఖ జర్నలిస్ట్ నిఖిల్ చక్రవర్తితో కలిసి ఆయన కార్లో ఒక సమావేశానికి బయల్దేరారు. నిఖిల్ చక్రవర్తిని భక్షీ కాశ్మీర్‌కు ఆహ్వానించారు. భక్షీ జర్నలిస్ట్‌ను కారు వెనుక సీట్లో కూర్చోపెట్టి, తాను మాత్రం ముందు సీట్లో కూర్చున్నాడు. ఆయన వ్యవహరించిన తీరుకు నిఖిల్ బాధపడ్డాడు. తాను ఏ ప్రముఖుడ్ని కలిసినా, ఆ ప్రముఖుడు తన ప్రక్కనే తనను గౌరవించిన అనేక సందర్భాలు ఆ జర్నలిస్ట్‌కు స్ఫురణకు వచ్చాయి.

అంతలో భక్షీ ''నిఖిల్‌జీ! నేనెప్పుడూ కార్లో ముందు సీట్లోనే కూర్చుంటాను. సాధారణంగా బుల్లెట్స్ వెనుక నుంచే వస్తాయి!'' అన్నాడు నవ్వుతూ.

అది విని నిఖిల్ దిగ్భ్రాంతి చెందాడు.

**-కొడిమెల**

## బాల సంపాదకుడు

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. అలాగే మిళింద దేశాయ్ వయసు *12* సంవత్సరాలు మాత్రమే. తన అసమాన ప్రజ్ఞాపాటవాల వలన అతను అతి చిన్న వయసుగల జర్నలిస్టుగా పేరుప్రఖ్యాతులు పొందాడు. అతను 'మన్‌థాన్' యాత్రావిశేషాలను తెలుపుతూ గుజరాత్ మేగజైన్‌కు రాసేడు. జబ్బుతో బాధపడుతూ కూడ ఎన్నో కవితలను, నవలను వ్రాసేడు. మిళింద్ తండ్రి హరిదేశాయ్ జన్మభూమి పత్రికకు సంపాదకుడు. మిళింద్ పత్రికలకు తన రచనలను నాల్గవసారి పంపడం, తనువు చాలించడం జరిగింది. బాల్యంలోనే నూర్లేళ్ల కీర్తిని సంపాదించి, ఆయుష్షు నిండిన మిళింద్ ఓ సంచలనంగా చరిత్రలో నిలిచిపోతాడు.

**-యం. పద్మావతి**

ప్రవీణ్ చేసిన తప్పేంత? వాడు తప్పు చెయ్యలేదని నేను అనడంలేదు. క్షమిస్తేనే వాడు పశ్చాత్తాపంతో కుంగిపోయి మనసు మార్చుకుంటాడు.''

వందన మూతి విరిచింది. నవీన్ ఆమెను దగ్గరగా తీసుకుని ''నీకన్నా నాకు ఎవరూ ఎక్కువ కాదు. నీ ఆనందం కన్నా ఏదీ ఎక్కువ కాదు. కానీ అమ్మా, నాన్నల సంతోషం కూడా నా ధర్మమే. ప్రవీణ్ ఉద్యోగంలో స్థిరపడేదాకా వాళ్లకి శాంతిలేదు. అందుకని వాడికి ఉద్యోగం వేయిస్తాను'' అన్నాడు.

వందన ఏం మాట్లాడలేదు. నవీన్ ఎంత ప్రయత్నించినా ప్రవీణ్‌ని క్షమించి వదిలెయ్యడం రైటని వందనని ఒప్పించలేకపోయాడు. అలాగని తన మార్గం తప్పని నమ్మనూ లేకపోయాడు.

• • •

అయిదేళ్లు గడిచాయి. ఉదయం వందన ఇచ్చిన కాఫీ తాగుతూ టి.వి చూస్తున్నాడు నవీన్. ఆనాటి థాట్ ఫర్ ది డే టీవీలో చూపించారు. చంపతగినంత శత్రువు వచ్చినా కూడా క్షమించి మేలుచేసి పంపించడమే మంచి పని అనే అర్థం వచ్చే వాక్యం టీవీలో చూసి తృప్తిగా నిట్టూర్చాడు నవీన్. తమ్ముణ్ణి క్షమించి, ఉద్యోగం వేయించాడు తను. కష్టపడి ఉద్యోగం చేసుకుంటూ, అవకాశం వచ్చినప్పుడల్లా ఇంకా మంచి ఉద్యోగం సంపాదించుకుంటూ పైపైకి ఎదిగిపోయాడు ప్రవీణ్. తను శిక్షించి వుంటే...

టీవీలో న్యూస్ వస్తోంది. గోడమీద పిల్లిలా ఇటూ అటూ దూకే రాజకీయ నాయకుల గురించీ, తమ ప్రాముఖ్యాన్ని నిలుపుకోడం కోసం పార్టీ లీడర్లు చేసే బందిల గురించీ, మంత్రుల విదేశయానాల గురించీ చెప్పాక న్యూస్ రీడర్ ''ఒక భయంకరమైన హత్య జరిగింది. యజమాని పదమూడేళ్ల కూతుర్ని రేప్ చేసి, కత్తితో పొడిచి చంపాడొక దుర్మార్గుడు. పదేళ్ల అబ్బాయి అక్కను కాపాడబోతే ఆ పిల్లవాణ్ణి కూడా పొడిచి చంపేశాడు'' అని వార్త చదివింది.

ఎలాంటి ఘోరం అని నవీన్ అనుకుంటూ వుండగా టీవీలో హత్య జరిగిన ప్రదేశాన్నీ, హతుల మృతదేహాల్నీ, వారి ఫోటోలనూ చూపించారు. ఎంత ముద్దుగా వున్నారో, ఎలా చంపగలిగాడో అనుకుంటూ వుండగా హంతకుడి ఫోటో టి.వి తెరమీద వచ్చింది. నవీన్ మ్రాన్పడిపోయాడు. ప్రవీణ్ ఫోటోలా అన్పించింది.

నవీన్ తేరుకుని ''మనిషిని పోలిన మనుషులుండరా'' అనుకుంటూనే పక్కన వున్న పేపరు తీశాడు. న్యూస్ పేపర్లో ప్రవీణ్ ఫోటోతోపాటు పేరు కూడా వుంది. హత్యా వివరాలు పూర్తిగా వున్నాయి.

ప్రవీణ్ పనిచేస్తున్న కంపెనీ యజమాని ఇంట్లో వుండిపోయిన ఒక ఫైలు కోసం ప్రవీణ్‌ని ఇంటికి పంపాడు. ఆ సమయంలో యజమాని పిల్లలిద్దరూ ఇంట్లో వున్నారు. యజమాని భార్య ఉద్యోగరీత్యా వేరే ఊళ్లో వుంటున్నది. వంటమనిషి వంటచేసి వెళ్లిపోయింది. పనివాడు బజారుకి వెళ్లాడు. ఒంటరిగా వున్న పిల్లల్ని చూడగానే ప్రవీణ్‌లోని రాక్షసుడు పైకి వచ్చాడు. అమ్మాయిని రేప్ చేసి, పిల్లలిద్దర్నీ కత్తితో పొడిచి, ఫైలు తీసుకుని, ఆఫీసుకి బయల్దేరాడు.

ప్రవీణ్ అనుకున్నట్లుగా జరిగితే నేరం అతనిమీదకి వచ్చేదికాదు. సాధారణంగా ఇలాంటిచోట్ల పనివాళ్లనే అనుమానిస్తారు. కానీ కొన ఊపిరితో వున్న అమ్మాయి తండ్రితో సెల్ ఫోన్‌లో విషయం చెప్పి చచ్చిపోయింది. ప్రవీణ్ వెంటనే అరెస్టయ్యాడు.

నవీన్ కదలకుండా కూచుండిపోయాడు. వందన వచ్చి పేపరు తీసి విషయం చదివింది. అతని చుట్టూ ఓదార్పుగా చేతులు వేసింది. అతను మరింతగా కుంగిపోయాడు.

ప్రవీణ్ హత్య చేసిన పిల్లల తండ్రి పెద్ద వ్యాపారవేత్త. కేసు త్వరత్వరగా కదిలింది. తీగ లాగితే డొంకంతా కదిలిందన్నట్లుగా ప్రవీణ్ చేసిన పాత తప్పులన్నీ బయటపడ్డాయి. నవీన్ అనుకున్నది తప్పు. ప్రవీణ్ ఉన్నత సోపానాలు ఎక్కుతూ ఉద్యోగాలు మారలేదు. తప్పులు చేస్తూ దొరుకుతానన్న భయం రాగానే ఊళ్లూ, ఉద్యోగాలూ మార్చేశాడు. అతను అంతకు ముందు చేసిన లైంగిక వేధింపులూ, మానభంగాలూ, మోసాలు బయటకు రాసాగాయి.

నవీన్ పూర్తిగా కుంగిపోయాడు. అతనికెందుకో తప్పంతా తనదే అన్పించింది. వందన చెప్పినట్లుగా విని వుంటే బాగుండేది, ఆమెపై అత్యాచారం చెయ్యబోయినప్పుడే శిక్షించాల్సింది. అప్పుడీ పరిస్థితి వచ్చేది కాదు. తోటకూరనాడేల చెప్పవైతివమ్మా అన్న నీతి కథ తను చిన్నప్పుడే చదువుకున్నాడు.

మొదటి నేరానికి శిక్ష పడితే మళ్లీ తప్పుచేసే ధైర్యం ఎవరికీ వుండదు. వందన చెప్పింది నిజం. పాపాత్ముల్ని క్షమిస్తూపోతే ప్రపంచంలో పాపమే మిగుల్తుంది. అసలు పాతకాలు అయిదుట. దొంగతనం, తాగుడు మొదలైనవి ఎంత పాపాలో ఆ పాపాలు చేసేవారితో స్నేహమూ అంతే పాపంట. అసలు ఆ అయిదవదే ఎక్కువ పాపమేమో. మిగిలిన తప్పులు చేసేవారికి తాము చేస్తున్నది తప్పని తెలియకపోవచ్చు. అయిదో రకం పాపాత్ముడికి అలా అనుకునే అవకాశం కూడా లేదే... నవీన్ ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోసాగాడు.

ప్రవీణ్‌కి ఉరిశిక్ష పడింది. ఆ ఉరితాడు తన మెడకే చుట్టుకుంటున్నట్లుగా అన్పించింది. నవీన్‌కి.

★

